క్లుప్తంగా

మూగ జీవాలకు పశుగ్రాసం



బొబ్బర్లంక(మోపిదేవి): వరద ముంపు గ్రామాలైన బొబ్బర్లంక, కె.కొత్తపాలెం గ్రామాల్లో మూగజీవాలకు పశుగ్రాసం అందించి దాతృత్వం చాటుకున్నారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అన్నారు. శివరామపురానికి చెందిన సుఖవాసి సురేష్ బాబు, మేకా రాధాకృష్ణ కంఠంనేని మను, వేములపల్లి శివప్రసాద్, రావి వీరయ్య మిత్ర బృందం సహకారంతో రూ. 1.50 లక్షల విలువైన 9 ఎకరాల గడ్డిని మూగ జీవాలకు అందజేసినట్లు వివరించారు. బొబ్బర్లంక, కె. కొత్తపాలెం సర్పంచ్‌లు దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసరాలు



గూడూరు: హైదరాబాద్‌కు చెందిన జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తుల మీరా కుమార్ ఆధ్వర్యంలో గురువారం గూడూరు మండలం కప్పలదొడ్డిలోని చేనేత కార్మికులకు నిత్యావసర వస్తువులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలోని చేనేత మగ్గం గుంతల్లో నీరు నిలిచి నేత కార్మికులకు పని లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో కలనేత చేనేత కార్మిక సంఘం అభ్యర్థనపై జాతీయ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు గుబ్బల ప్రసాద్ చొరవతో జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ గ్రామంలోని 125 మంది కార్మిక కుటుంబాలకు రూ.90 వేల విలువైన నిత్యావసర వస్తువులు పంపిణీ చేసింది. బాధితులకు అవసరమైన సాయం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కలనేత చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు బూసం లోకనాథ్‌రావు, పేరిశెట్టి నాగరవి, బూసం శ్యామలరావు, తెలంగాణ శెట్టిబలిజ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వాసంశెట్టి శ్రీనివాస్, కోశాధికారి పిల్లి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ కుటుంబానికి భరోసా



అవనిగడ్డ: ఇటీవల మరణించిన అవనిగడ్డకు చెందిన టైలర్ కాశీ గుణశేఖర్‌కు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ రూ.10 వేలు సాయం అందించారు. మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని కొంతమంది టైలర్ అసోసియేషన్ నాయకులు విక్కుర్తికి వివరించగా స్పందించిన ఆయన గుణశేఖర్ కుమార్తె చదువు కోసం రూ.10 వేలను ఆయన కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి వీరరాఘవయ్య ఫౌండేషన్ ప్రతినిధి రాంబాబు, పున్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

భూషణగుళ్ళ(పెదపారుపూడి): మండలంలోని భూషణగుళ్ళ-1 సెంటర్‌లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం మాస ఉత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ పెదపారుపూడి సెక్టర్ సూపర్‌వైజర్ అరుణకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు నీటిలోనే జీవనం



కె. కొత్తపాలెం(మోపిదేవి): వరద ప్రభావంతో నివాసాల చుట్టూ మురుగునీరు చేరింది. భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని దురదలు వస్తున్నాయని వరద బాధితులు వాపోతున్నారు. మండలంలోని కె. కొత్తపాలెం ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇంటి చుట్టూ వరద నీరు నిలిచి దుర్వాసన వస్తోందని ఈ నీటిలో దిగితే దురదలతో శరీరంపై పుండ్లు పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పంచాయతీ అధికారులు ఆయిల్ పంపు ద్వారా నీటిని తోడుతున్నారని, అవి ఎన్ని రోజులకు బయటకు పోతాయో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు వాసనతో పాటు దోమల ధాటికి ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని త్వరగా మురుగునీటి నుంచి తమను కాపాడాలని రాజులపాటి బలరామయ్య, రాజులపాటి బాబూరావు తదితరులు కోరుతున్నారు.

పంట వదులుకోవడమే..!

- పంట నష్టం నమోదు వివరాలు పూర్తైదంటున్న అధికారులు
- రికార్డుల్లో ఉన్నవి.. ఈ క్రాప్ అయినవి మాత్రమే నమోదు
- రెవెన్యూ.. వ్యవసాయశాఖల మధ్య సమన్వయ లోపం!



పెడన మండలం పెనుమల్లిలో నీటమునిగిన పొలాలు

పెడన: ఆరుగాలం కష్టపడ్డ రైతు భారీ వర్షాలతో పంటను వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండు నెలలు వేసిన పంట నీటి పాలు కావడంతో రైతు కన్నీరుపెడుతున్నారు. నీరందని పరిస్థితిలో ఒకసారి ఎండి పోయి మొలక రాక, వచ్చిన మొలక కాస్తా ఎండకు ఎండిపోయి ఇబ్బందులు పడి మళ్లీ పంట వేసుకున్నారు. తీరా చేతికి వస్తుందనుకున్న పంట కాస్తా భారీ వర్షాలకు మునిగిపోవడం, నీరు బయటకు పోక, నారు కుళ్లిపోయింది. చివరకు పంటను వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో వైపు పంట నష్టం నమోదుపై అధికారులు టైం అయిపోయిందని చెబుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు కూడా పొందలేదని, మా పంట ఏ విధంగా నమోదు చేస్తారంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ క్రాప్ అయి ఉంటేనే ప్రస్తుతం పంట నష్టానికి సంబంధించి పేర్లు నమోదు చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. మండలంలోని గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు(వీఏఏ- వీలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు) ఈ క్రాప్ నమోదు, మరోపక్క ఈకేవైసీలు చేస్తున్న తరుణంలో పంట నష్టపోయిన వారి పేర్లను కూడా నమోదు చేయాలని ఆదేశాలు రావడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో వీరి పేర్లను పూర్తిస్థాయిలో సేకరించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది కొరత, కొత్తగా వచ్చిన వీఏఏలకు ఆయా గ్రామాలపై పూర్తి అవగాహన లేక చేతులు ఎత్తివేయడంతో రైతులు తమ పంట నమోదుకు అధికారులు, సిబ్బంది వస్తారని ఎదురుచూస్తున్నారు. పెడన తోటమూల, పైడమ్మ కాలనీ ప్రాంతాల్లో పంటలు ముంపులోనే ఉన్నాయి. సదరు విషయమై ఆ ప్రాంతాల వీఆర్వోలను సంప్రదిస్తే వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి మేం రావాల్సి ఉందని, వారెవరూ రావడం లేదని వీఆర్వోలు పేర్కొనడం విశేషం.



పెడన మండలం కోటవానిపాలెంలో ఎండకు వడిపోయి ఎండిపోతున్న వేరుశెనగ

రికార్డుల్లో ఉన్న పంట మాత్రమే నమోదు

పెడన మండల పరిధిలోని నందమూరు పంచాయతీ కోటవానిపాలెం, కాకర్లమూడి పంచాయతీ కాకర్లమూడి పాలెం గ్రామాల్లో వేరుశెనగ పంటను వేశారు. సుమారు 52 ఎకరాల్లో పంట వేశారు. భారీ వర్షాలకు అవి దెబ్బతిన్నాయి. వీటిల్లో సుమారు 25 నుంచి 30 ఎకరాలకు మాత్రమే రికార్డులున్నాయి. మిగిలిన వాటికి లేవు. మమ్మల్ని కూడా గుర్తించి మా పంటను ఫొటో తీసి నష్టపరిహారం ఇవ్వాలని వేరుశెనగ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికి సంబంధించి ఈ క్రాప్ అయితేనే చేస్తున్నారు. ఒక వేళ పంట నష్టం నమోదు చేసినా తప్పనిసరిగా ఈ క్రాప్ కూడా చేస్తున్నారు. తప్పనిసరిగా రికార్డులో పొందు పరిచి ఉన్నవి మాత్రమే నమోదవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

పంట పూర్తిగా దెబ్బతింది



పంట మొత్తం పోయింది. 90 సెంట్లలో వేరుశెనగ వేశా. పూర్తిగా దెబ్బతింది. ఇంకో నెల ఉంటే పంట చేతికి వచ్చేది. ఖర్చులు పోను రూ.30 వేలు మిగులుతుందని అనుకున్నా. ఇప్పటి వరకు రూ.16 వేలకుపైగా ఖర్చు పెట్టా. ఇది కాకుండా పెడన పైడమ్మ కాలనీ వైపు ఎకరం పొలం కౌలుకు చేస్తున్నా. పంట నమోదు కోసం ఎవరైనా వస్తారని ఎదురుచూస్తున్నాం. పక్క పొలాల వారికి చెప్పి ఫోన్ నంబరు కూడా ఇచ్చా. ఎవరూ రాలేదంటున్నారు. పూర్తిగా వరిచేను మునిగిపోయింది. ఎందుకు పనికిరాదు.

–జోగి ఆదినారాయణ, కోటవానిపాలెం, నందమూరు పంచాయతీ, పెడన

ఎందుకూ పనికిరాదు



పెనుమల్లిలో నాలుగు ఎకరాలుంది. మా నాన్న రాంబాబుకు నాలుగు ఎకరాలుంది. మొత్తం ఎనిమిది ఎకరాలు కూడా ముంపులోనే ఉన్నాయి. ఎందుకు పనికి రాదు. మోకాలి లోతు నీరు. ఇంకా బయటకు పోని దుస్థితి. ఇపుపడు కొత్తగా పంట వేద్దామన్న నారు దొరకదు. దొరికినా పంట సమయం సరిపోదు. ఈ పరిస్థితిలో పంటను వదులుకోవడమే ఉత్తమం.

– గరికిపాటి లక్ష్మీ నరసయ్య, పెనుమల్లి, పెడన మండలం

పారదర్శకంగా పంట నష్టం నమోదు

మండలంలో పంట నష్టపోయిన వారి వివరాలను పారదర్శకంగా నమోదు చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన వారి వివరాలను నమోదు చేయాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్ అయి ఉండాలి. అలా ఉన్న వారి పేర్లను నమోదు చేశారు. మండల వ్యాప్తంగా ఎక్కడ పంట నష్టపోయినా వారి వివరాలను తీసుకోవాలని వీఏఏలకు చెప్పా. అన్ని చోట్ల తీసుకుంటున్నారు. వీఆర్వోలను కలిసి నమోదు చేస్తున్నారు.

–నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన

నాడు మునిగి.. నేడు చాలక..

సాగునీటి నియంత్రణలో యంత్రాంగం విఫలమైందంటున్న రైతులు



నాగాయలంక మండలం చోడవరం పర్రలో సాగునీరు అందక పంటపొలాల పరిస్థితి ఇది

భావదేవరపల్లి(నాగాయలంక): పది రోజుల క్రితం అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో ఎడతెరపి లేకుండా పడిన అధిక వర్షం కారణంగా మండలంలోని కొన్ని దిగువ గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో వరిపొలాలు నిండా నీట మునిగాయి.ఇప్పుడేమో సాగునీరు చాలక తీవ్రంగా నష్టపోతున్నామంటూ రైతులు లబోదిబోమంటున్నారు. నాగాయలంక మండలంలోని భావదేవరపల్లి రెవెన్యూ పరిధిలో సెంట్రల్ ఛానల్ అనుబంధంగా ఉన్న 2, 2ఏ ఉప కాల్వల కింద, చోడవరం పర్రలో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది.


పంట కాలువల నియంత్రణలో ఇరిగేషన్ అధికారుల పూర్తిగా విఫలం కావడంతో తరచూ ఈ పరిస్థితులు వస్తున్నాయని రైతు ప్రతినిధులు, రైతులు గగ్గోలు పెట్టారు.

అధికారులు సమగ్ర నీటి ప్రణాళిక చేయాలి

పంట కాలువలను సక్రమ నియంత్రణతో రైతులకు బాసటగా నిలవాలి. కానీ ఇరిగేషన్ అధికారులు సక్రమంగా నియంత్రణ చేపట్టని కారణంగానే చోడవరం తదితర ప్రాంతాల్లో తరచూ ఇలాంటి పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. సంబంధిత అధికారులపై ఉన్నతాధికారుల అజమాయిషీ లేదు. అధికారులు, నాయకులు స్పందించి సమగ్ర నీటి ప్రణాళిక చేయాలి.

–బీసాబత్తుని ప్రసాద్, రైతు, డీసీ మాజీ చైర్మన్, నాగాయలంక

వరద బాధితులకు చేయూత



కొత్తపల్లి ఎస్సీ కాలనీలో బాధితులకు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



విరాళాన్ని ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న యూవీఆర్ గొర్రెపాటి స్కూల్ విద్యార్థులు

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం ఎస్సీ కాలనీలో వరద బాధితులకు యూఎస్‌ఏ తానా టీమ్ కో–చైర్ ఎన్నారై చందనం ప్రదీప్ ఆధ్వర్యంలో సమకూర్చిన వస్త్రాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందజేశారు. సుమారు 300 మంది వరద బాధితులకు సాయం అందచేసినట్లు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తెలిపారు. ప్రవీణ్, వెంకటేశ్వరావు సర్పంచ్ మాధవి, మాజీ సర్పంచ్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల గ్రామంలోని ఉదయ భాస్కరమ్మ – వెంకట్రాయులు గొర్రెపాటి స్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. బుడమేరు పరీవాహక వరద బాధితులకు యూవీఆర్ స్కూల్లో ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులు సంయుక్తంగా సేకరించిన రూ.14 వేల విరాళాన్ని గురువారం గొర్రెపాటి ఫౌండేషన్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, యూవీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావులకు అందించారు.

యాజమాన్య పద్ధతులతో చీడ పురుగులు, తెగుళ్ల నివారణ



వెంకటాపురంలో రైతు శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రేవతి

వెంకటాపురం(మోపిదేవి): వరిలో చీడ పురుగులు, తెగుళ్లపై రైతులు యాజమాన్య పద్ధతులతో పూర్తిగా నివారించాలని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో గురువారం వరిలో ఆశించే వివిధ చీడపురుగుల నివారణపై రైతులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. వరి పంటలో ఏఏ చీడపీడల ఉధృతి ఉంటుందో గమనించాలని సూచించారు. ఆకు ముడత పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పాడ తెగులు నివారణకు హెక్సాకెనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా అజాక్సీస్ట్రోబిన్ ఒక మిల్లీ లీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు యశ్వంత్ కుమార్, నవీన, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్టేడియంలో ధ్యాన శిక్షణ తరగతులు



ధ్యానం చేస్తున్న మహిళలు

గుడివాడ టౌన్: పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సామూహిక ధ్యాన శిక్షణ తరగతులు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకురాలు రాజకుమారి మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ధ్యాన కేంద్రం కొనసాగిస్తామన్నారు. ఆసక్తిగల వారు ధ్యానంలో పాల్గొనాలని కోరారు.

11వ నంబర్ కాలువపై రివిట్‌మెంట్ నిర్మాణం



బండికోళ్లంక(మోపిదేవి): కేఈబీ కెనాల్ కింద 11వ నంబర్ కాలువపై రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టినట్లు ఇరిగేషన్ డీఈ రవి కిరణ్ తెలిపారు. మండలంలోని బండికోళ్లంక వద్ద వరదల కారణంగా ఏర్పడిన గండిని పూడ్చి రివిట్‌మెంట్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వరదల ఉధృతికి కేఈబీ కెనాల్‌కు వచ్చిన వరద కారణంగా భారీ గండి ఏర్పడిందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో అత్యవసర పనుల కింద రూ. 9.50 లక్షలతో రివిట్‌మెంట్ పనులు చేపట్టినట్లు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి లాక్‌కు సరిపడా ఎత్తులో మట్టి కూడా పోయిస్తున్నట్లు తెలిపారు. ఏఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న చంద్రహాసోపాఖ్యానం

నాగాయలంక: స్థానిక వినాయక నవరాత్రి ఉత్సవ వేదికపై గురువారం మధ్యాహ్నం జరిగిన చంద్రహాసోపాఖ్యానం హరికథాగానం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సబ్బినేని బోసు(చల్లపల్లి)సౌజన్యంతో కర్నూలుకు చెందిన తాటికొండ సాయిరామ్ భాగవతార్ అద్భుతమైన శైలితో కథ ఆలపించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. పూజల్లో భాగంగా లక్ష్మీగణపతి హోమం జరిగింది.

కొల్లూరు శివశంకర్, అహల్య దంపతులు ఆరో రోజు వినాయక ఉత్సవ పూజలో పీటలపై కూర్చున్నారు. శ్రీలక్ష్మీదేవి అమ్మవారి సామూహిక కుంకుమ పూజ శుక్రవారం ఉదయం 9గంటలకు జరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.



కోడూరులోని మాచవరంలో గణనాథుడికి పూజలు



ఊరేగింపుగా వెళ్తున్న బంటుమిల్లి మూడో దిబ్బ గణపతి

గణనాయకా.. కరుణించవయ్యా..

మచిలీపట్నంటౌన్: వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాథుడి పందిళ్ల వద్ద స్వామివారికి ఆరో రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పందిళ్ల వద్ద నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మోపిదేవి: మోపిదేవి గౌడపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాన్ని గురువారం సాయంత్రం కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలు డప్పుకళాకారుల సందడితో గ్రామంలో భారీ ఊరేగింపు జరిగింది. స్థానిక ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

బంటుమిల్లి: మండలంలో పలుచోట్ల వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కొందరు సందడిగా నిమజ్జనోత్సవం చేశారు.

కృత్తివెన్ను: మండలంలో నీలిపూడి, కృత్తివెన్ను పలుచోట్ల వినాయక విగ్రహాలను ఊరేగించారు.

కొడాలి(ఘంటసాల): మండలంలోని కొడాలి ఎస్టీ కాలనీలో విఘ్నాధిపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తజన సందడితో విగ్రహ నిమజ్జనం జరిగింది.

కోడూరు: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాల వద్ద నవరాత్రి ఉత్సవాలను భక్తి ప్రపత్తులతో కొనసాగిస్తున్నారు. కొన్ని మండలాల వద్ద ఉత్సవాలను ముగించి లంబోదరుడిని నిమజ్జనాలకు తరలిస్తున్నారు. గురువారం జయపురం, కోడూరు తూర్పువైపు, అయ్యప్పస్వామివారి దేవాలయం, మాచవరం, వడ్డెరకాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఊరేగించారు.



బందరులో కలెక్టరేట్ ప్రధాన కార్యాలయం వద్ద పందిరిలో పూజలు

డప్పువాయిద్యాలు, మేళతాళాలు, డీజే పాటల నిమజ్జనోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. గ్రామోత్సవం అనంతనం విగ్రహాలను ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ శిరీష పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



మోపిదేవి పురవీధుల్లో ఊరేగుతున్న గణేశుడు



రాజుపేటలో చవితి పందిరిలో చీరలతో అలంకారం



కోడూరు వడ్డెరకాలనీలో వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం

ఏచూరి మృతికి సంతాపం

బంటుమిల్లి: సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి సీతారాం మృతికి ఆ పార్టీ స్థానిక నేతలు సంతాపం తెలిపారు. స్థానిక లక్ష్మీపురం సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురువారం ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రైతు సంఘ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ.. రూ.1.31 లక్షలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 9వ డివిజన్ బ్రహ్మపురంలో ఉన్న శ్రీ సాయి గణేష్ దేవాలయం వద్ద బుధవారం రాత్రి గణనాథుడి లడ్డూ వేలం నిర్వహించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ– రమణ (చంటి) దంపతులు రూ. 1.31 లక్షలకు దక్కించుకున్నారు. 16 సంవత్సరాలుగా ఈ ఆలయం గణేష్ నవరాత్రి మహోత్సవాల పందిరిలో ఏర్పాటు చేసిన లడ్డూలను వాణిశ్రీ దంపతులే దక్కించుకుంటున్నారు. వారిని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఆలయం వద్ద ఈ నెల 24వ తేదీ మంగళవారం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు చెప్పారు.

ఆక్రమణలు తొలగించాకే డ్రెయిన్ అభివృద్ధి పనులు

పామర్రు: ఆక్రమణలు తొలగించిన తర్వాతే డ్రెయిన్ అభివృద్ధి పనులు చేపడతామని ఇరిగేషన్ శాఖ జేఈ రామ్‌కుమార్ తెలిపారు. పామర్రు మురుగు డ్రెయిన్ పరీవాహక ప్రాంతం, చల్లపల్లి రోడ్డు వెంబడి ఉన్న డ్రెయిన్లను గురువారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కొంత మంది డ్రెయిన్లు ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేపట్టారని, వాటికి పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను సైతం ఆక్రమించుకుని చుట్టూ గ్రీన్ క్లాత్‌లు చుట్టారని తమ పరిశీలనలో తేలిందన్నారు. సత్వరమే ఆ గ్రీన్ మ్యాట్‌లను తొలగించాలని పేర్కొన్నారు. చల్లపల్లి రోడ్డు వెంబడి ఉన్న డ్రెయిన్‌ను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో డ్రెయిన్‌లో అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారని చెప్పారు. సమస్యలు పరిష్కారమయ్యే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్థానికులకు జేఈ హామీ ఇచ్చారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కంకిపాడు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కంకిపాడు పట్టణంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మా కార్యక్రమం గురువారం నిర్వహించారు. సామాజిక కార్యకర్త యలమంచిలి కిషోర్‌బాబు చేతుల మీదుగా మొక్కలు నాటారు. పలువురు స్థానికులు పాల్గొన్నారు.